విపుల: మార్చి 1981

# తథాస్తు

రామశాస్త్రి తండ్రి వైదిక విద్యలో ప్రవీణుడు. అయితే రామశాస్త్రికి తండ్రి నుండి వైదిక విద్యా ప్రావీణ్యత అబ్బలేదు.

అలా అని ఇంగ్లీషు చదువూ అబ్బలేదు.

రామశాస్త్రి పెద్దన్న కెమికల్ ఇంజనీరు. ఇంకో అన్న సెంట్రల్ గవర్నమెంట్‌లో ఉద్యోగి. పెద్దక్కగారు, ఆవిడ భర్త ఉపన్యాసకులు కళాశాలలో.

చిన్నక్కగారు, ఆవిడ భర్త ఫారెన్‌లో సెటిలయ్యారు.

తండ్రి పొయ్యేనాటికి రామశాస్త్రికి మిగిలింది ఓ డాబా, నాలుగెకరాల పొలం, మతి స్థిమితం లేని తల్లి, నెల తప్పిన భార్య, సిద్ధాంతిగారి ఆఖరబ్బాయన్న పేరూను! రామశాస్త్రికి ఉంగరాల క్రాపుంది. అహర్నిశలూ బుగ్గన జర్దా కిళ్ళీ వుంటుంది. గ్లాస్కో పంచె, టెరికాటన్ లాల్చీ, కళ్ళకు గాగుల్స్, ఇవన్నీ కలిపి రామశాస్త్రి అవుతాడు. బ్రతకటం ఎలా?

రామశాస్త్రి ఆలోచించాడు.

మాసికాలు పెట్టించడం రాదు.

వివాహాలు జరిపించటం చేతగాదు.

గ్రహశాంతులు, గర్భాదానాలు చేయించడం రాదు.

ఉద్యోగానికి చాలినంత చదువూ లేదు. ఎలా?

పెళ్ళాం కని, పుట్టింట్లో వుండగా, అత్తవారింటికి బారసాలకు వెడితే -

అత్తగారు, "మా అల్లుడు మహారాజు పిన్నీ. ముప్పొద్దులా తిని, ఆబోతులా వూరి మీద పడి తిరుగుతాడు" అని అన్నది.

మామగారు, "నా ఖర్మకొద్దీ ఈ సంబంధం కుదిరింది. ఎంతో అబ్బురంగా పెంచి, అమ్మాయిని ఓ శుంఠకిచ్చి చేశాను" అని వాపోయాడు అయిన వాళ్ళతో.

బావమరుదులు, "పోస్ట్‌మాన్ వుద్యోగం ఇప్పిస్తాం బావా హాయిగా ఖాకీ గుడ్డలేసుకు సైకిలెక్కి ఇంటింటికీ తిరగొచ్చు" అన్నారు. ఆఖరికి బారసాల చేయించేందుకు వచ్చిన ఒంటికంటి బ్రాహ్మడు కూడా, "సిద్ధాంతి కడుపున ఎలా పుట్టావయ్యా - కేశవ నామాలు కూడా రాకుండా?" అని ఎద్దేవా చేశాడు!

రామశాస్త్రి అహం పదిమందిలో సిగ్గిడిచేసింది.

ఇంటికొచ్చి ఆలోచించాడు.

బ్రతకాలి.

ఘనంగా బ్రతకాలి!

పదిమంది నోళ్ళు కొట్టయినా సరే!

అబద్ధాలాడయినా సరే!

ప్రయోజకుడనిపించుకోవాలి.

పదిమందిలో 'సెభాష్' అనిపించుకోవాలి.

ఏదీగాదూ?

పెరట్లో వున్న నుయ్యిలో దూకెయ్యాలి.

రైలు క్రింద పడి చావాలి!

బ్రతకటానికి మార్గాలు లేవుగాని చచ్చేందుకు ఏముంది?

రామశాస్త్రి అర్ధరూపాయంత పిలక పెట్టుకున్నాడు. నుదుట విభూతి రేఖలు దట్టించాడు. ఆపైన గంధం బొట్టు, అక్షింతలు జత చేశాడు.

చెవులకు బంగారపు పోగులు పెట్టుకున్నాడు. మెడలో రుద్రాక్షల తావళం వేసుకున్నాడు.

గ్లాస్కో పంచె కట్టుకుని, పైన తండ్రి మిగిల్చిన సిల్క్ శాలువా కప్పుకున్నాడు.

సైకిలెక్కాడు.

కొంత దూరం వెళ్ళేసరికి ఓ మోతుబరి కడుతున్న ఇల్లు కనిపించింది.

సైకిలాపాడు.

ఇంటి గుమ్మాలు పరిశీలించాడు.

ఆపైన -

ఇల్లు కట్టే మేస్త్రీని పిల్చి, "ఎవరోయ్! ఇంటి ప్లాన్ వేసింది! ఎనిమిది వాకిళ్ళు పెట్టి, ఇంటాయన కొంప తీశాడే!" అని సైకిలెక్కాడు.

ఇంటి యజమాని పరుగెత్తుకొచ్చాడు.

మరోసారి, ఓ భాగ్యవంతుడు పెద్ద బీరు షాపు ప్రారంభోత్సవం చేస్తున్నాడు.

ప్రారంభోత్సవం అయిందాకా ఆగి, భాగ్యవంతుడిని పక్కకు పిల్చి, "నవగ్రహాల పూజ చేయించారా షాపు తెరిచే ముందు?" అనడిగాడు.

భాగ్యవంతుడు 'లేదు' అన్నట్లు చూశాడు.

ఓ వారం తర్వాత భాగ్యవంతుడు పరిగెత్తుకొచ్చాడు. వచ్చి,"అయ్యా! నా షాపులో బ్రాందీ తాగి నలుగురు హరీ అన్నారు. పోలీసులు నా షాపు మూసేయించారు. మీరా నాడు దేవుళ్ళా వచ్చి నవగ్రహాల పూజ చేయించావా అన్నారు. మీరు త్రికాలజ్ఞులు" అని కాళ్ళ మీద పడిపోయాడు.

ఇలా....

ఒకరికి జాతకం చెప్పాడు.

మరొకరికి లగ్నం పెట్టాడు.

వేరొకరికి ముహూర్తం పెట్టించాడు.

రామశాస్త్రి స్కూటర్ కొన్నాడు, అర్నెల్లలో.

పెళ్ళిళ్ళు కుదురుస్తాడు. పిచ్చీ కుదురుస్తాడు.

గ్రహశాంతి చేయిస్తాడు. దోషం ఎంచి చెబుతాడు.

రామశాస్త్రికి రాని విద్య లేదు.

డబ్బున్నవాళ్ళకు రామశాస్త్రి హితుడు, గురువు.

ఎంతయినా సింహం కడుపున మేక పుడుతుందా?

సిద్ధాంతి కొడుకు తండ్రిని మించాడు.

రామశాస్త్రి అఖండుడు.

సంవత్సరానికల్లా రామశాస్త్రి గిరాకీ పెరిగింది.

ఇల్లు బాగు చేయించాడు.

ఇంట్లో ఉయ్యాల బల్ల వేయించాడు.

పేము కుర్చీలు, ఫోమ్ బెడ్డూ తెప్పించాడు.

తెల్లారింది మొదలు అర్ధరాత్రి దాకా తీరిక లేదు.

అత్తగారు, "మా అల్లుడు ఏమో అనుకున్నాను గానీ అసాధ్యుడు పిన్నీ. ఊళ్ళో ఏ రిక్షావాడినన్నా అడుగు రామశాస్త్రిగారింటికని, తీసుకుపోతాడు" అని చెబుతుంది.

మామగారు సరేసరి, "మా రామశాస్త్రి లాంటి అల్లుడు దొరకటం నిజంగా ఎంతో అదృష్టం సుమా" అంటాడు.

బావమరుదులు రామశాస్త్రి ఎదటకే రావటానికి భయపడతారిప్పుడు.

ఇలా -

డబ్బున్న వాళ్ళకు, జబ్బులున్న వాళ్ళకు, పదవి వున్న వాళ్ళు, పదవి కోరే వాళ్ళకు, పెళ్ళి చేయాలనుకున్న వాళ్ళు, పెళ్ళి కావాలనుకున్న వాళ్ళు, ఇల్లు వున్నవాళ్ళు, ఇంటిలో సుఖం లేనివాళ్ళు, ఉద్యోగులు - నిరుద్యోగులు, సదాయోగులు అందరికీ రామశాస్త్రి ఉపయోగపడుతున్నవేళ.....

ఓ బడుగు పంతులు రామశాస్త్రి కాళ్ళట్టుకున్నాడు. పంతులుకు పిల్లలెక్కువ. ఆదాయం తక్కువ.

పెద్దవాడు బి.ఏ.

రెండోవాడు ఇంటరు.

మూడోవాడు యస్సెస్సీ.

నాలుగోవాడు ఏడు.

ఐదు ఐదు.

ఆరు, ఏడు మూడు.

ఎనిమది గేదె పాలు

పంతులుకు ఏ పనీ చేతగాదు, భార్యకు నెల తప్పించడం తప్ప.

పిత్రార్జితం పురుళ్ళకూ, పేకాటకు సరిపోయింది. స్వార్జితం యెనిమిది మంది మొగ పిల్లలు.

"నీవే తప్ప ఇతఃపరం బెరుగ! మన్నింపగదే దీనునిన్" అని పంతులు ప్రాధేయపడగా, రామశాస్త్రి, "ఏం కావాలో అడుగు" అంటూ వరాన్నిచ్చే దేవుళ్ళా అడిగాడు.

"అబ్బాయికి ఉద్యోగం?"

"సరే! మరి నా ఫీజు?"

"నా చర్మం వల్చి చెప్పులు కుట్టిస్తాను. వచ్చే జన్మలో కుక్కగా పుట్టి మీ ఇంటికి కాపలా వుంటాను."

రామశాస్త్రి తల పంకించి, నవ్వి - "ఇలా చెప్పులు కుట్టించేవాళ్ళూ, కుక్కలా పుట్టి కాపలా కాసేవాళ్ళూ వేలల్లో వున్నారు" అని, పంతులును పట్టుకెళ్ళి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించి, ప్రభుత్వం ఇచ్చే డబ్బు, బోణీ కింద జమ వేసుకున్నాడు.

పంతులు కొడుకు బి.ఏ.కు ఉద్యోగం వేయించేందుకు హామీ ఇచ్చి, అప్పుడప్పుడు కనబడుతుండమని చెప్పాడు.

ఇలా ఉద్యోగాలకు, సలహాలకు, సంప్రదింపులకు, జనం తిరనాళ్ళలాగా రావటం, రామశాస్త్రి ఆదాయం, ఆదాయంతో పరపతి, పరపతితో పాటు ప్రాముఖ్యత పెరగటంతో- అధికార్లు, అనధికార్లు, కార్లున్నవాళ్ళు పరిచయమయ్యారు.

అలాంటివాళ్ళల్లో కనకాచలంబొకడు!

కనకాచలానికి పాడి అవు లాంటి ప్రభుత్వ నౌకరీ వుంది. నౌకరీతోపాటు నెలసరి ఆదాయముంది. వార్షికంగా ముడుపులూ వున్నాయి. వీటితోపాటు ఆరుగురు ఆడపిల్లలూ వున్నారు.

అందులో ఓ పిల్ల పెళ్ళికెదిగి కూడా వుంది.

కనకాచలం కూతురు తండ్రిలా బక్కగానూ వుండదు. తల్లిలా దిబ్బ రొట్టెలానూ వుండదు.

పోలిక - హనుమంతుడి చెల్లెలు.

రూపం - కాకికి దీటు.

మాట - గార్ధభానికి సరి.

వున్న గుణం కనకాచలం కూతురవడమే!

కనకాచలం కూతురికీ, పంతులు కొడుక్కీ లంకె బెడదాం అనుకున్నాడు రామశాస్త్రి.

పంతులు కొడుకు బి.ఏ.కి కనకాచలం ఆఫీసులో ఇంటర్వ్యూ వచ్చింది.

కనకాచలానికి పంతులు కొడుకుని చూపి, "ఉద్యోగం వేయించు! పిల్ల పెళ్ళి ఖాయం చేద్దాం" అని చెప్పాడు.

కనకాచలం బి.ఏ.కి ఉద్యోగం వేయించాడు. పెళ్ళిచూపులు అయిందనిపించాడు.

ఇహ లగ్నాలు పెట్టుకోవడమే.

బి.ఏ. మొరాయించాడు.

బి.ఏ. రామశాస్త్రి కాళ్ళట్టుకున్నాడు ఏకాంతంగా.

"మావాడు ఆ పిల్లను చేసుకోనంటున్నాడు. బలవంతాన చేస్తే, నూతిలోనో, రైలు క్రిందో పడతానంటున్నాడు! ఉద్యోగం ఇప్పించారు, మా కింత తిండి పెట్టారు. వాణ్ణి బ్రతికించే మార్గం మీదే!" అన్నాడు పంతులు.

"కనాకచలం కూతురు గతేమిటి?"

పంతులు మాట్లాడలేదు.

"నా మాట ఏమౌతుంది?"

"......"

"ఉద్యోగం రాగానే ఇలా మాట తప్పడం మర్యాద కాదు!"

ఇలా బెదిరించాడు. నచ్చచెప్పాడు.

ఊహూ! పంతులు మెత్తబడలేదు.

"కనకాచలానికి డబ్బుంది. బంగారమంటి ఉద్యోగముంది. నాకొక్కడే పెద్దకొడుకు. కనకాచలం కూతురుకి మరో సంబంధం కుదురుతుంది. మీరు కుదర్చగలరు!" పంతులు ఘోష అది.

రామశాస్త్రి ఆలోచించాడు.

తనకు వైదిక విద్య రాదు.

లగ్నాలు పెట్టడం రాదు.

మంత్రాలు, మహిమలు లేవు.

జాతకాలు చూడటం రాదు.

మరి ఇంత డబ్బు, హోదా ఎలా వచ్చింది?

జనం మూర్ఖులు, గొర్రెలు!!

కుండెడు పాలలో ఓ విషం చుక్క చాలు.

కుండెడు విషంలో, బండెడు పాలు పోసినా ఫలితం లేదు, శూన్యం.

ప్రతివాడికీ భవిష్యత్తు మీద ఆశ.

ఎవరన్నా చెడు చెబితే భయం.

'ఇదీ తప్పు! దెబ్బతింటావ్!' అంటే నమ్మకం.

జనంలో వున్న బలహీనత మీద దెబ్బ కొడితే లొంగుతారు, ఎంతవారయినా!

అధికారంలో వున్నవాళ్ళు చేసేదీ, అధికారం కోసం అర్రులు చాచేవాళ్ళు ప్రయోగం చేసేదీ, బాబాలు బ్రతుకుతున్నదీ, స్వాములార్లు మనుగడ సాగిస్తున్నదీ, గుళ్ళూ, మసీదులూ, చర్చిలూ మనగలుగుతున్నదీ భయం వల్ల, లౌక్యం మీద. అస్తిత్వం లేక పోవటం వల్లనే!

కనుక -

అటు కనకాచలం, ఇటు పంతులు కొడుకూ తనను తిట్టుకోకుండా వుండాలంటే మార్గం?

"లౌక్యం"

రామశాస్త్రి ప్రయోగించాడు.

"కనకాచలం! పంతులు కొడుక్కి అర్ధాయుష్షు! నీ ఇష్టం! సంబంధం నిశ్చయించేదా?"

కనకాచలం, "వద్దు" అన్నాడు.

పంతులు, "మీ మాట అమోఘం!" అని రామశాస్త్రిని పొగిడాడు.

సర్వేజనా సుఖినోభవంతు!

అయితే పంతులు కొడుకు బి.ఏ. అకస్మాత్తుగా 'పొయ్యాడు.'

కనకాచలం, "అయ్యబాబోయ్! పంతులు నిజం చెప్పకపోతే, నా కూతురు గతి ఏమయ్యేదీ?" అని సంతోషించాడు. పంతులు మాత్రం, "హారి వీడి నోరు పడిపోనూ! ఏ క్షణాన 'అర్ధాయుష్షు' అన్నాడో గానీ, ఎదిగొచ్చిన కొడుకు కాలం చేశాడే" అని వాపోయాడు.

రామశాస్త్రి అవాక్కయిపోయాడు, ఈ సంఘటన జరిగాక. ●